ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 , కనిష్ఠం 23.6





## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భిక్కనూరు, జూలై 7: భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు.



# ఉద్యోగుల బదిలీలకు.. కసరత్తు!



- జిల్లాలో సాధారణ బదిలీలు
- బదిలీల కోసం జీవో జారీ చేసిన ప్రభుత్వం
- డిప్యూటేషన్‌లు రద్దు.. రెండేళ్లు దాటితే బదిలినే
- సీనియార్టీ, ఖాళీల ప్రదర్శన
- ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు
- 9 నుంచి 12 వరకు ఉద్యోగుల ఆప్షన్లతో దరఖాస్తుల స్వీకరణ
- 18 వరకు దరఖాస్తుల పరిశీలన, మాస్టర్ లిస్ట్ తయారీ
- 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులు
- జిల్లా వ్యాప్తంగా 3900 మంది ప్రభుత్వ ఉద్యోగులు
- ఇప్పటికే విద్యాశాఖలో పూర్తయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

కామారెడ్డి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అధికారులు, ఉద్యోగుల బదిలీల కల త్వరలోనే నెరవేరనుంది. 2018 తర్వాత సాధారణ బదిలీలు జరుగుతుండడంతో శాఖల వారీగా ఖాళీలు, సీనియార్టీ జాబితాతో పాటు తప్పనిసరి బదిలీ అయ్యే అధికారులు, ఉద్యోగుల జాబితా రూపొందిస్తున్నారు. అటెండర్ నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు స్థాన చలనం తప్పనిసరి కావడంతో పలువురు అప్పుడే పైరవీలు మొదలుపెట్టారు. మరికొందరు అదృష్టాన్ని నమ్ముకుంటున్నారు. సంబంధిత శాఖల అధిపతుల నుంచి ఈనెల 8 వరకు ఖాళీల ప్రదర్శన సీనియార్టీ జాబితాతో పాటు బదిలీ తప్పనిసరి అయ్యే ఉద్యోగుల జాబితా పెట్టనున్నారు. సాధారణ బదిలీల నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు సైతం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### జిల్లాలో 3900 మందికి పైగా ఉద్యోగులు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో సుమారు 3900 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. గెజిటెడ్ అధికారులు 600 ఉండగా, నాన్ గెజిటెడ్ అధికారులు 2500 మంది, 4వ తరగతి ఉద్యోగులు 800ల వరకు ఉన్నట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపడుతున్నందున షెడ్యూల్ సైతం ఖరారు చేసింది. జూలై 5 నుంచి 8 వరకు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి సీనియార్టి జాబితా, ఖాళీల ప్రదర్శన బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 9 నుంచి 12 వరకు ఉద్యోగుల ఆప్షన్‌లతో కూడిన దరఖాస్తుల స్వీకరణ చేయనున్నారు. 13 నుంచి 18 వరకు దరఖాస్తుల పరిశీలన, మాస్టర్ లిస్ట్ తయారీ చేపట్టనున్నారు. 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులు, కేటాయించిన స్థానాల్లో మూడు రోజుల్లో విధుల్లో చేరాలని షెడ్యూల్ విడుదల చేశారు.

### బదిలీల కోసం కమిటీల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను రాష్ట్రస్థాయి, మల్టీజోన్, జోనల్, జిల్లా క్యాడర్‌గా విభజించారు. ఆయా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి బదిలీకి ఉత్తర్వులను జారీ చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో పోస్టులకు శాఖకు సంబంధించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. హెచ్‌వోడీ కన్వీనర్‌గా, సంయుక్త ఉప కార్యద ర్శులు సభ్యులుగా ఉండనున్నారు. మల్టీజోనల్, జోనల్ స్థాయి పోస్టుల చైర్మన్‌గా కార్యదర్శి సూచించిన వారు సభ్యులుగా, హెచ్‌వోడీ సూచించిన వారు కన్వీనర్‌గా వ్యవహరించనుండగా క్యాడర్ పోస్టులకు కలెక్టర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, డీఆర్‌వో సభ్యులుగా ఉండనుండగా శాఖకు సంబంధించిన జిల్లా అధికారి కన్వీనర్‌గా వ్యవ హరించనున్నారు.

### 40 శాతం వరకు ఉద్యోగుల బదిలీలు

సాధారణ బదిలీల్లో భాగంగా నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ధేశం చింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి రెండేళ్లు ఒకేచోట పనిచేసి ఉంటే బదిలీకి అర్హులు. నాలుగేళ్లు ఒకేచోట పని చేసిన వారికి బదిలీ తప్పనిసరి. గరిష్ఠంగా 40 శాతం ఉద్యోగులకు మించకుండా బదిలీలు జరగనున్నాయి. స్పౌజ్ కేటగిరీతో పాటు 2025 జూన్ 30 నాటికి ఉద్యోగ విరమణ చేసేవారు, 70 శాతం వైకల్యం, మానసిక వికలాంగులతో కూడిన పిల్లలున్న, వితంతువులు, మెడికల్ గ్రౌండ్స్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కాగా శాఖల వారీగా హెచ్‌వోడీ సంబంధిత ఉద్యోగుల సీనియార్టీ జాబితా ప్రచురించాలి. ఈ నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల నుంచి 5 ఆప్షన్‌లు తీసుకోను న్నారు. అయితే బదిలీల గైడ్‌లైన్స్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రవాణా, విద్య, అటవీ, పోలీసు శాఖలకు వర్తించవని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

### మొదలైన పైరవీలు

రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వశాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ఆదేశించడంతో నచ్చిన చోటుకు బదిలీ చేసుకునేందుకు ఉద్యోగులు, అధికారులు పైరవీలు మొదలు పెట్టారు. పట్టణాలు, కలెక్టరేట్‌ను వీడని అధికారులు, ఉద్యోగులు పైరవీలు చేస్తున్నారు. తమకు ఉన్న పలుకుబడితో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అనుకూలమైన ప్రాంతానికి పోస్టింగ్ వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో పాటు రాజకీయ నేతలు, ప్రముఖ ప్రజాప్రతినిధులు ఇలా ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కీలకమైన స్థానాల్లోనే ఉండేలా కసరత్తు చేస్తున్నారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఏఈలు, ఏవోలు, ఏపీఓలతో పాటు ఇరిగేషన్, డీఆర్‌డీవో, మున్సిపల్, ఎలక్ట్రిసిటి తదితర శాఖల అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

### బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

**వెంకట్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు**

సాధారణ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించనందున జిల్లాలో పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలి. సీనియార్టీ జాబితా, ఉద్యోగుల ఖాళీల విషయంలో అవకతవకలు జరగకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లాలో 3900 మంది ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు జరిగే అవకాశం ఉంది.

# పుట్టగొడుగుల్లా ఫర్టిలైజర్ షాపులు

- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- రైతులకు అంటగడుతున్న నకిలీ విత్తనాలు, ఎరువులు
- కొరబడిన వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ

ఎల్లారెడ్డి, జూలై 7 : కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు పరిసర గ్రామాల్లో సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వానాకాలం సీజన్ మొదలు కావడంతో అన్నదాతలు స్థానికంగా ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులకు వెళ్లి వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతుల అమాయకత్వానికి ఆసరా చేసుకుని షాపుల నిర్వాహకులు దిగుబడి బాగా వస్తుందని కంపెనీలు ఇచ్చే ఆఫర్లు, లాభాలు బాగా వచ్చే విత్తనాలను దీనికి తోడు పంటల తెగుళ్లకు నివారణకు దుకాణాల నిర్వాహకులు రైతులకు ఇష్టం వచ్చిన పెస్టిసైడ్స్ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని 22 మండలాల్లో 525 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 3,16,560 లక్షల మంది రైతులు ఉన్నారు. 5,14,290 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో అనుమతులు లేకున్నా సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. గత కొంత కాలంగా నకిలీ విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్న వ్యవసాయశాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు రైతుల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కానీ అప్పుడప్పుడు తనిఖీలు చేపడుతూ ఫొటోలకు ఫోజులిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



ఎల్లారెడ్డిలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

### డీలర్లకు కంపెనీల ఆఫర్లు

పలు సీడ్స్ పెస్టిసైడ్స్ కంపెనీలు డీలర్లకు విదేశీ టూర్లు, ప్రత్యేక ప్యాకేజీల ఆఫర్లు ఇస్తుండటంతో ఆ కంపెనీలకు చెందిన విత్తనాలు పెస్టిసైడ్స్‌ను రైతులకు మాయ మాటలు చెప్పి విక్రయిస్తున్నారు. ఎక్కువగా టార్గెట్ పూర్తి చేసిన డీలర్లకు జల్సాల కోసం పలు కంపెనీలు టూర్లకు పంపిస్తున్నాయి. కానీ నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మాత్రం పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి.

### ఈ అనుమతులు తప్పనిసరి

- ఫర్టిలైజర్‌కు ఆన్‌లైన్, పెస్టిసైడ్స్‌కు మాన్యువల్‌గా దరఖాస్తులు చేసుకోవాలి
- ఫర్టిలైజర్స్‌కు ఏడీఏ, సీడ్స్, పెస్టిసైడ్స్‌కు జిల్లా వ్యవసాయ అధికారి అనుమతులు ఇస్తారు
- పెస్టిసైడ్స్‌కు బీఎస్సీ సైన్స్, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్‌కు డిప్లొమా అగ్రికల్చర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి
- షాపుల నిర్వాహకులకు అర్హతలు లేకపోతే సర్టిఫికెట్ కలిగిన వ్యక్తులను టెక్నికల్ పర్సన్స్‌గా పెట్టుకోవాలి
- పెస్టిసైడ్స్‌కు లైఫ్ టైం అనుమతి కాగా ఫర్టిలైజర్స్‌కు ఐదేళ్లు, సీడ్స్‌కు ఐదేళ్ల వరకు అనుమతి ఉంటుంది. తదుపరి తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలి

## నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో..
# సమయానికి అల్పాహారం అందక విద్యార్థినుల అవస్థలు

నాగిరెడ్డిపేట, జూలై 7: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు సిబ్బంది సమయానికి అల్పాహారం, భోజనం పెట్టక పోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటల లోపు అల్పాహారం అందించాల్సి ఉండగా ఉదయం 11 గంటలైనా వారికి అల్పాహారం పెట్టకపోవడంతో విద్యార్థినులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల వరకు విద్యార్థినులకు అల్పాహారాన్ని సిబ్బంది అందించకపోవడంతో ఆదివారం తమ పిల్లలను కలిసేందుకు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రుల ద్వారా ఈ విషయం బయటకు పొక్కింది. విషయం తెలుసుకున్న స్థానిక విలేకరులు కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లగా ప్రతీ ఆదివారం తమకు ఉదయం 11 గంటల వరకు అల్పాహారం పెట్టడం లేదని విద్యార్థినులు విలేకరుల ముందు వాపోయారు. ఆదివారం మధ్యాహ్నం భోజనం కూడా మధ్యాహ్నం 3 గంటలకు పెడుతున్నారని వారు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది లేకపోవడంతో వంట సిబ్బంది వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని విద్యార్థినులకు సకాలంలో అల్పాహారం, నాణ్యమైన భోజనం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



అల్పాహారం కోసం బారులు తీరిన విద్యార్థినులు

# అధ్వానం.. ఉద్యాన క్షేత్రం



మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రం ముఖద్వారం

- నిలిచి పోయిన మొక్కల ఉత్పత్తి
- పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న ఉద్యాన క్షేత్రం
- అధికారుల నిర్లక్ష్యం, నిధుల కొరతతో క్షేత్రంలో కుంటుపడ్డ అభివృద్ధి
- క్షేత్రంపై దృష్టి సారించని ఉన్నతాధికారులు

నాగిరెడ్డిపేట, జూలై 2 : ఒకప్పుడు వివిధ మేలు రకాల పండ్ల మొక్కలను ఉత్పత్తి చేయడంలో ఉమ్మడి రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన మాల్తుమ్మెద ప్రభుత్వ ఉద్యాన క్షేత్రం ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం, నిధుల కొరత తదితర కారణాల వల్ల నేడు ఈ ఉద్యాన క్షేత్రం అధ్వానంగా మారింది. గతంలో ఈ ఉద్యాన క్షేత్రంలో ఉత్పత్తి చేసే వివిధ మేలు రకాల పండ్ల మొక్కలను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సరఫరా చేసేవారు. రాను రాను పండ్ల మొక్కల ఉత్పత్తి తగ్గుతూ రాగా, ప్రస్తుతం మొక్కల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రభుత్వ ఉద్యాన క్షేత్రం ప్రస్తుతం అభివృద్ధిలో పూర్తిగా కుంటుపడగా క్షేత్రంలో పెరిగిన పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తోంది. 1982లో మాల్తుమ్మెద క్షేత్రం పక్కనే 60 ఎకరాల్లో ప్రభుత్వం ఉద్యాన వన క్షేత్రాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో వివిధ మేలు రకాలకు చెందిన పండ్ల మొక్కలతో పాటు పూల మొక్కలను క్షేత్రంలో ఉత్పత్తి చేసేవారు. మామిడి మొక్కలను అంట్లు కట్టే పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసేవారు. ఈ ఉద్యాన క్షేత్రంలో 25 ఎకరాల్లో మామిడి తోట, సుమారు రెండున్నర ఎకరాల్లో జామ తోటతో పాటు మూడెకరాల్లో దానిమ్మ తోట, రెండున్నర ఎకరాల్లో ఆపిల్ బెర్రీ తోట, ఒక ఎకరంలో ఉసిరి తోటలుండగా, దానిమ్మ, ఆపిల్ బెర్రి చెట్లను తొలగించి అక్కడ కొత్తగా మామిడి చెట్లను నాటారు. క్షేత్రంలోని మామిడి తోట కాతను ప్రతీ సంవత్సరం వేలంపాట నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యాన క్షేత్రంలో పలువురు అధికారులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక హార్టికల్చర్ అధికారి రామకృష్ణ మాత్రమే ఉన్నారు. దినసరి కూలీలుగా ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారు. ఉన్న హార్టికల్చర్ అధికారి ఇక్కడ సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. ఈ క్షేత్రంలోని అధికారి ఎప్పుడు ఉంటారో ఎవరికి తెలియని పరిస్థితి దాపురించింది.

### రూ. కోటి వెచ్చించినా ఫలితం శూన్యం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ప్రభుత్వం మాల్తుమ్మెద ప్రభుత్వ ఉద్యాన క్షేత్రం అభివృద్ధిపై దృష్టి సారించింది. ఉమ్మడి రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఉద్యాన క్షేత్రం నిర్వీర్యం అవుతుందని గ్రహించిన తెలంగాణ ప్రభుత్వం ఈ ఉద్యాన క్షేత్రానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేశారు. ఈ ఉద్యాన క్షేత్రం అభివృద్ధి కోసం నిధులను కేటాయించారు. 2015-16లో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు పునఃనిర్మాణ పనుల ఉద్యానవన శాఖ నిధుల ద్వారా ఒక కోటి రూపాయలను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరైన ఒక కోటి రూపాయల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి 7 మే 2016లో ప్రారంభించారు. కోటి రూపాయల నిధులతో క్షేత్రంలో ఫార్మేషన్ రోడ్ల ఏర్పాటు, కార్యాలయ భవనాలకు మరమ్మతులు, క్షేత్రంలో సోలార్ లైట్‌ల ఏర్పాటు, రెండు షెడ్ నెట్ల ఏర్పాటు, పంటల సాగు కోసం ట్రాక్టర్, బుష్ కట్టర్ల ఏర్పాటు, అంట్లు కట్టిన మొక్కలను భద్రపరిచేందుకు గాను మిస్ట్ చాంబర్‌ను ఏర్పాటు చేశారు. తదితర పనుల కోసం నిధులను వెచ్చించారు. గత ఎనిమిదేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం ఏ లక్ష్యంతో క్షేత్రంలో కోటి రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు జరిపారో ఆ పనులకు అర్థం లేకుండాపోయింది. ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరలేదు.

### రైతులకు శిక్షణ కరువు

ప్రయోగాత్మకంగా సాగు చేసే వివిధ రకాల పంటల సాగుపైన, పంటలకు వాడే ఎరువులు, పంటల అధిక దిగుబడుల గురించి జిల్లా రైతులకు శిక్షణ కల్పించేందుకు క్షేత్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రం నిర్వహణకు నిధులు లేక, నిర్వహణ లేక రైతులకు మేలు రకాల పంటల సాగుపై శిక్షణ కరువైంది.

### పసుపు సాగుకు మంగళం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పసుపు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి హార్టికల్చర్ ఉన్నతాధికారులు ప్రణాళికలు తయారు చేశా రు. ఇందుకోసం మేలు రకం పసుపు వంగడాలను తెచ్చి ఈ క్షేత్రంలో సాగు చేశారు. పంట దిగుబడి సరిగ్గా రాకపోవడంతో క్షేత్రంలో పసుపు సాగుకు అధికారులు మంగళం పాడారు. దీంతో క్షేత్రంలో మేలు రకాల పసుపు సాగు ముందుకు సాగడం లేదు.

### పని చేయని సోలార్ లైట్లు

ఉద్యాన క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు వెలగడం లేదు. క్షేత్రంలో సోలార్ బోరు మోటార్ పని చేయక వృథాగా మారింది. క్షేత్రం అభివృద్ధిలో భాగంగా క్షేత్రంలో విద్యుత్‌తో పని లేకుండా సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సోలార్ లైట్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. సోలార్ బ్యాటరీలు చెడిపోవడం, వాటికి మరమ్మతులు లేకపోవడంతో సోలార్ లైట్లు వెలగడం లేదు. అలాగే ఉద్యాన క్షేత్రంలో రెండు షెడ్ నెట్‌లు ఉండగా అందులో ఒకటి పూర్తిగా ధ్వంసం కాగా మరొకటి పిచ్చి మొక్కలతో నిండిపోయింది. మొక్కలను భద్రపరిచే మిస్ట్ చాంబర్ వినియోగంలో లేకుండా పోయింది.

### ఉద్యాన క్షేత్రం అభివృద్ధికి కృషి చేయాలి

మాల్తుమ్మెద ప్రభుత్వ ఉద్యాన క్షేత్రం అభివృద్ధికి ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు కృషి చేయాలి. మేలు రకాల పండ్ల మొక్కల ఉత్పత్తిలో వెనుకబడిన ఈ క్షేత్రంలో తిరిగి పండ్ల మొక్కల ఉత్పత్తితో పాటు, వివిధ అభివృద్ధి జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



షెడ్‌నెట్‌లో ఏపుగా లేచిన పిచ్చి మొక్కలు




# ప్రమాదం అంచున ప్రయాణం

- కల్వర్టు రక్షణ గోడలు ధ్వంసం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



పొతంగల్ చెక్‌పోస్టు వద్ద రక్షణ గోడలు లేని కల్వర్టు



పొతంగల్ చెరువు సమీపంలో కూలిపోయిన రక్షణ గోడలు

కోటగిరి,జులై7: మండల కేంద్రాలను కలిపే ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో కల్వర్టు ప్రదేశాలు వాహనదారులకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. అసలే ఇరుకుగా ఉన్న ప్రదేశాలు ఆపై కల్వర్టుల రక్షణ గోడలు ధ్వంసమవ్వడంతో అక్కడ బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు రహదారులు, భవనాల శాఖ రహదారుల్లోనూ.. ఇటు పంచాయతీ రాజ్ రోడ్లను ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు గత ఐదేళ్లుగా ఈ సమస్యలపై సంబంధిత శాఖ అధికారులను ఫిర్యాదు చేసిన, విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా తమ పరిధిలోకి రాదంటే తమ పరిధిలోకి రాదంటూ అధికారులు చేతులెత్తేయడం గమనార్హం. కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు రహదారులపై ఉన్న కల్వర్టులు అధ్వానంగా తయారయ్యాయి. కోటగిరి, రుద్రూర్ ప్రధాన రహదారిపై బండి వాగు, దర్గా వాగు, మల్కాపూర్ గడి వద్ద రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది క్రితం మల్కాపూర్ గడి సమీపంలో ద్విచక్ర వాహనదారుడు రక్షణ గోడ లేకపోవడంతో కాలువలో పడి మృతి చెందాడు. పొతంగల్ మండలంలోని పొతంగల్ చెక్‌పోస్టు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. నిజాంసాగర్ కాలువపై ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బీర్కూర్ వెళ్లే వాహనాలు ఈ ప్రాంతం వద్ద అజాగ్రత్తగా నడిపితే పెద్ద ఎత్తున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. పొతంగల్ చెరువు సమీపంలోనూ, బారపుల్ కల్వర్టు వద్ద సైతం పరిస్థితి ఇలాగే ఉంది. వర్షాలు కురుస్తుండడంతో కల్వర్టుల వద్ద మొక్కలు పెరిగి కనపడే పరిస్థితి లేకుండాపోయింది. ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్లలలో ప్రమాదకరంగా మారిన ప్రదేశాలపై సంబంధిత అధికారులు ఉదాసీదాగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్, టాక్లీ మధ్యగల కల్వర్టు ప్రమాదంగా మారింది. కోతకు గురవ్వడంతో ఇక్కడ ప్రయాణం చేయడం ప్రమాదకరంగా మారింది. కల్వర్టులను పూర్తిస్థాయిలో విస్తకరించి ఆధునీకరించాల్సి ఉన్న అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శంగా మారింది. మండల పరిషత్ సమావేశాల్లో వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ ఈ విషయపై ఆర్ అండ్ బీ అధికారులను ప్రతి సమావేశంలో ప్రశ్నిస్తున్న తమకేమీ పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. వాహనదారులు అజాగ్రత్తగా నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనీసం అధికారులు కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలు అయిన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

### ఇబ్బందులు పడుతున్నాం

రక్షణ గోడలు లేక శిథిలావస్థలో ఉన్న రహదారులపై రాత్రి సమయంలో వెళ్లేప్పుడు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయమేస్తుంది. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

- యూసుఫ్, పొతంగల్

## నేడు డిచ్‌పల్లి ఠాణాలో న్యూ క్రిమినల్ లాపై అవగాహన

- హాజరుకానున్న సీపీ, ఢిల్లీ నుంచి న్యాయశాస్త్ర ప్రొఫెసర్‌లు



కొత్తగా నాటిన మొక్కలు

డిచ్‌పల్లి,జులై 7:కేంద్ర ప్రభుత్వం నూ తన చట్టాలను అమలులోకి తీసుకొచ్చిన నేఏథ్యంలో ఆ చటా ్టల పని తీరు స్వయం గా పరిశీలించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఢిల్లీ నుంచి పోలీస్ శాఖ, న్యాయ శాఖ నిపుణుల కమిటీల బృందం డిచ్‌పల్లి ఠాణాలో అవగాహన సదస్సు నేడు నిర్వహించనున్నారు. డిచ్‌పల్లి ఎస్సైమహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఠాణాను సర్వంగా సుందరంగా ముస్తా బు చేశారు. నూతన మొక్కలు నాటా రు.పిచ్చి మొక్కలు తొలగించారు. అం తే గా కుండా వాటి స్థలంలో నూతన మొక్కలు నాటారు. శిథలావస్థకు చెందిన పాత బోర్డులను తోగించి నూతన బోర్డులు ఏర్పాటు చేశారు. ఠాణా చుట్టూ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పోలీస్ సిబ్బంది ఠాణాలో ఈ పను లు చేయడానికి ముమ్మర కసరత్తు చేశారు. మూలన పడినబైకులు సరి చేసి పెట్టారు. జిల్లాలోనే క్రిమినల్ లా చట్టాలపై అవగహన కల్గిం చేం దుకు డిచ్‌పల్లి ఠాణా ను మొద టగా ఎంపిక చేయడం గమనించదగ్గ విషయం.




# కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదళ్లు

- బలహీనపడుతున్న కట్ట
- వర్షాకాలంలో కట్టతెగే ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



కెనాల్‌కు గండిపడిన దృశ్యం(ఫైల్)



కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

ఆర్మూర్‌టౌన్ , జూలై7: ఆర్మూర్ శివారులోని టీచర్స్‌కాలనీ, జర్నలిసు కాలనీ, రంగచారినగర్, ఒడ్డెరకాలనీ వరకు నిజాంసాగర్‌కెనాల్‌లో పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలు ఏపుగా పెరిగిపోయాయి. రాబోయే వర్షాకాలంలో వరద నీటితో కెనాల్‌లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటను దృష్టిలో ఉంచుకొని గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు, కుంటలు నింపడానికి నీటిని వదలగా జర్నలిస్టు కాలనీలో అర్ధారాత్రి నిజాంసాగర్ కెనాల్‌కు గండి పడడంతో లోతట్టు ప్రాంతంలో నివాసమున్న వారి ఇళ్ళ నీరు చేరింది. దీంతో నిత్యవసర సరుకులు సైతం నష్టపోయారు. విద్యుత్ స్తంభం పడిపోయింది. కాలనీవాసులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఏలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఇప్పటి వరకు నిజాంసాగర్ కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్ళపొదలను తీయకపోవడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు కెనాల్‌లో పెరుకుపోయిన చెత్త, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిజాంసాగర్ కెనాల్‌ను శుభ్రపర్చాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీలో నీరు చేరిన దృశ్యం (ఫైల్)

### తక్షణమే జిల్లా అధికారులు చొరవ చూపాలి

నిజాంసాగర్ కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించడానికి జిల్లా అధికారులు చొరవ చూపి కొన్నేళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించాలి.

- తిరుపతి, ఆర్మూర్







## ఫత్తేపూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, జూలై7: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యాసంవత్సరం పదవ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 28ఏళ్ళ క్రితం చదువుకున్న అనాటి విద్యార్థులు ఒక్కచోట చేరి ఒకరినోకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి తిపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు మల్కాన్న, రమణరెడ్డి, నర్సయ్య, లింగుసా, రాజ్‌కుమార్‌లను పూర్వవిద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాస్, తట్లపల్లి గణేష్, సాయిరెడ్డి, నగేష్‌రెడ్డి, వేణు, గంగరాజం, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడ పిల్లల వివాహాలకు ప్రభుత్వ సహాయం : జుక్కల్ ఎమ్మెల్యే



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

మద్నూర్, జూలై 7: పేదింటి ఆడ పిల్లల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేరిట ఆర్థికసాయం అందజేస్తున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 42మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో సౌకర్యవంత మైందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందని, రాబోయే ఐదేళ్లలో జుక్కల్ నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని, గ్రామ గ్రామాన సీసీ రోడ్డు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, డోంగ్లి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బసవరాజ్ పటేల్, మద్నూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరస్ సాయిలు, డోంగ్లీ మాజీ ఎంపీటీసీ ధీన్ దయాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తప్పవు: ఎస్సై

భిక్కనూరు, జూలై 7: వరిసాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్లపై కేజ్‌వీల్స్ నడపవద్దని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ హెచ్చరించారు. ఆదివారం ఎస్సై మాట్లాడుతూ కేజ్‌వీల్స్ రోడ్లపై నడిపి రోడ్లను ధ్వంసం చేస్తే సహించేది లేదని, కేజ్‌వీల్స్ రోడ్లపై ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నడిపితే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు సైతం తమతో సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## హోంశాఖ సహాయ మంత్రిని కలిసి బీజేపీ నాయకులు


కేంద్ర సహాయ మంత్రిని కలిసిన దృశ్యం

బోధన్‌రూరల్,జులై7: హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీని ఆదివారం బోధన్ బీజేపీ నాయకులు కరీంనగర్ క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా బోధన్‌లోని రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అడ్లూరిశ్రీనివాస్,అశోక్‌గౌడ్‌లతో తదితరులున్నారు.

## బోధన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బోధన్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జులై7: బోధన్ పట్టణంలోని వంశీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 2000-2001 ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పూర్వ విద్యార్థులు 23సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. 10వ తరగతిలో చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, కొన్ని ప్రైవేట్ సంస్థల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. 23సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వంశీ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పద్మజ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పదవ తరగతిలో చదువు చెప్పిన రాంప్రసాద్ గురువుకు పూర్వ విద్యార్థులు 101000రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న దృశ్యం

పెర్కిట్, జూలై7: పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని పార్కులో హ్యాపీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వన మహోత్సవం కార్యక్రమంనిర్వహించారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా తమవంతుగా కనీసం రెండు చెట్లు అయిన నాటలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొని పాఠశాల విద్యార్థులతో,పార్కుకు వచ్చేవా కర్స్ అందరితో కలిసి మొక్కలు నాటారు. అదే విధంగా పార్కుకు పక్కనే ఉన్న ఓపెన్ జీమ్‌లోని వ్యాయామ పరికరాలను రెండు రోజుల్లోగా బాగు చేయిస్తానని అన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ రాజుకు ఫోన్ చేసి రెండు రోజుల్లోగా ఓపెన్ జీమ్‌లోని వ్యాయమ పరికరాలు బాగు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో స్థానిక కౌన్సిలర్ వరలక్ష్మీ లింబాద్రిగౌడ్, పోలసుధాకర్, పూజ నరేం దర్, టీచర్ మనోహర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జక్రాన్‌పల్లిలో కొనసాగుతున్న వన మహోత్సవం


మొక్కలను పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ్‌పల్లి ప్రత్యేక అధికారి

జక్రాన్‌పల్లి, జూలై7: మండలంలోని అన్ని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను గ్రామప్రత్యేక అధికారి బ్రహ్మనందం పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి మొక్కలను అందజేశారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడి టీచర్‌లు, అంగన్‌వాడి టీచర్‌లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పోచారం మాజీ ఎంపీటీసీకి ఘన సన్మానం

ఎడపల్లి,జూలై7:మండలంలోని పోచారం గ్రామ మాజీ ఎంపీటీసి బద్దోల పద్మ, ముత్తన్న దంపతులను ఆదివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీగా పదవీ కాలం ముగియడంతో గ్రామస్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీటీసీగా పదవీ కాలంలో వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా గ్రామ అభివృద్ధికి వారు ఎంతో పాటు పడ్డారని, గ్రామ సమస్యల పరిష్కారంలో ముందున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు అశోక్, ఇస్త్రారీ, కోల సాయిలు, కమ్మరి రవి, కట్ట సుదాకర్, సంతోష్, శివ తదితరులు ఉన్నారు.

### అంకాపూర్‌లో ఎంపీటీసీలకు సన్మానం

**ఆర్మూర్‌రూరల్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఇటీవల పదవికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీటీసీలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీఎంపీటీసీలు ఎంసీ.గంగారెడ్డి, మహేందర్, మాజీమండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్ ముక్తార్‌లను గ్రామస్థులు సన్మానించారు. ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేశామని, తమకు సహకరించిన గ్రామస్థులకు, గ్రామస్థాయి అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## పడకల్ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

జక్రాన్‌పల్లి, జూలై7: మండలంలోని పడకల్ గ్రామంలో గ్రంథాలయానికి పుస్తకాలను ఉపాధ్యాయులు అంకం నరేష్, శ్రీనివాస్ ప్రోత్సహంతో వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు నర్సయ్య పుస్తకాలను వితరణ చేశారు. ఆదివారం పడకల్ గ్రంథాలయానికి రూ.5వేల విలువ గల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోక పురుషోత్తం, వై.గణేష్ గంగారెడ్డి, పోశెట్టి, బాలగౌడ్, సుధాకర్, రవీంధర్, వినిత్, అంకం నరేష్, అకాష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు


తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోటగిరి,జులై7: ఎమ్మార్పీఎస్ రజతోత్సవను పురస్కరించుకుని కోటగిరి మండలం నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో దేగాం సాయిలు, సాయన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోపు సాయిలు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఉన్నారు.

# హౌసింగ్ బోర్డులో డ్రైనేజ్ బాగు చేయరా..?

● గత కొన్నేళ్లుగా కచ్చ డ్రైనేజీ ● పట్టించుకోని పాలక వర్గం ● ఇబ్బందుల్లో కాలనీవాసులు


హౌసింగ్‌బోర్డులో కచ్చడ్రైనేజీ


హౌసింగ్‌బోర్డులో గుంతలు పడ్డ రోడ్డు

ఆర్మూర్‌రూరల్, జూలై7: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ అస్త వ్య స్తంగా ఉండడంతో ప్రజలకు అసౌకర్యంగా మా రింది. స్థానిక క్షత్రీయ కళ్యాణ మండపం సమీపంలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో కచ్చడ్రైనేజీ ద్వారా మురికి నీరు వెళ్తున్నాయి. దీంతో పందుల బెడద ఎక్కువగా మా రింది. ఆర్మూర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సి పాలిటీ స్థాయికి మారినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. గత కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ హౌజింగ్‌బోర్డును అభివృద్ధి చేయడంలో నిర లక్ష్యం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. డ్రైనేజీ నిర్మాణంతో పాటు కాలనీలో ప్రధాన రోడ్లు సీసీ, తారురోడ్లు వేయాల్సి ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కాలనీలో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్ప డ్డాయి. అయిన ప్పటికీ మున్సిపల్ అధికారులు సరైన చర్యలు చేపట్టా లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు కురిస్తే పరి స్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలోనే డ్రైనేజీ నిర్మిస్తాం



హౌసింగ్‌బోర్డులో త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం.గతంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి అట్టి నిధు లు రాకపోవ డంతో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణంలో జాప్యం జరిగింది. మున్సిపల్ నిధుల నుంచి డ్రైనేజీ,రోడ్డు వ్యవస్థను మెరుగుపరుస్తాం.

-వరలక్ష్మీ లింబాద్రిగౌడ్, కౌన్సిలర్

### ● గుంతలు పడ్డ రోడ్డు

బస్టాండ్ వైపు నుంచి హౌసింగ్‌బోర్డుకు వచ్చేదారిలో రోడ్లపై తారు లేచిపోయి గుంతలు పడి వాహన దారులకు ఇబ్బందిగా మారింది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతో ఉంది. మున్సిపల్‌కు ఇంటి పన్నుల రూపంలో డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ ప్రజలకు సరైన సౌకర్యాలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి రోడ్డు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే పోచారం గ్రూపుల పరంగా విమర్శలు చేస్తే సహించేది లేదు

● పార్టీ వెన్నంటి ఉన్న వారికే స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత : బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

వర్ని,జులై7: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన స్థాయిని మరిచి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయ తగాదాలు సృష్టించేలా విమర్శలకు దిగుతున్నారని వర్ని మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ సమక్షంలో వారు వర్నిలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పోచారంను ఆహ్వానించిన పోచారం సీఎంను ఆహ్వానించిన పార్టీ విలువలకు కట్టుబడి ఉండకుండా పోచారం పార్టీకి నష్టం కలిగించేలా పత్రిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో పదేళ్ల పాటు పలు కీలక పదవులు అనుభవించిన పోచారం మాజీ సీఎం కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కాసుల బాలరాజును స్కూటర్లు, మీటర్ల దొంగగా చిత్రీకరించి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరి అదే బాలరాజును అక్కున చేర్చుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. సంస్కార్ భూముల విషయంలోనూ తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఈ విధానంతో ప్రజలు సైతం పోచారం వైఖరిపై నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పలు ఎన్నికల్లో పోచారం మూడో స్థానానికి దిగజారారని కాంగ్రెస్ పార్టీ మాత్రం డిపాజిట్‌లో మొదటి స్థానంలో ఉందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని సవాల్ చేశారు. తన సహచరులకు కబ్జాలు చేయించిన ఘనత పోచారంది కాదా అని ప్రశ్నించారు. ఏఐసీసీ ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు అన్ని ఎన్నికల్లో సముచిత గౌరవం లభిస్తోందని భరోసా ఇచ్చారు. ఇక నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి తప్పుడు ఆరోపణలకు దిగితే తమ పార్టీ నాయకత్వం చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు కులకర్ణి సురేష్, భజ్యా నాయక్, రెడ్డి రాంబాబు, గంగప్పా. దశరథ్, ప్రసాద్, రమేష్ రాథోడ్, వకీల్ ఫారం రాంబాబు, కోనేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా ?

● గోవూర్ శివారులో నిజామాబాద్-బాన్సువాడ రోడ్డులో తరచూ ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందుల్లో గ్రామస్థులు


గోవూర్‌లో ప్రమాదాలు జరుగుతున్న స్థలం ఇదే..

మోస్రా,జూలై7: మండలంలోని గోవూర్ గ్రామ శివారులోని నిజామాబాద్ బాన్సువాడ రోడ్డుపై తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా ఇక్కడి ప్రాంతం రోడ్డును ప్రమాద సంబంధిత ప్రాంతంగా రోడ్డు రవాణా శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా బారికేట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఆయా శాఖల అధికారులకు మొరపెట్టిన ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే లేడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరుచు జరుగుతున్న ప్రమాదాల వల్ల ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందారని మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేడియంతో కూడిన ప్రమాద హెచ్చరిక సూచికబోర్డు, రేడియంతో కూడిన బారికేట్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు, సహకార సంఘ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, ఆయా పార్టీల నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ● ఓవర్ స్పీడ్ వల్లనే ప్రమాదాలు

రోడ్డు పరంగా ప్రాబ్లమ్ లేదు. ఓవర్ స్పీడ్ వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. బారీకేడ్లు పోలీసుశాఖ, ఆర్‌టీఏ వాళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని అని అన్నారు. ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ బారికేడ్లు ఇస్తామని ఆర్ అండ్ బీ ఏఈతో చెప్పినాము బారిగేట్లుకు గుద్దుకుని మళ్లీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. బారిగేట్లు ఇస్తాము కాని రాంబుల్ స్ట్రైక్స్ ఎక్కువగా వేయాలి అని ఆయన అన్నారు.

# బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ


బోధన్‌లో బోనాల పండుగ దృశ్యం


నగరంలో బోనాలు ఎత్తుకున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 7: రైల్వే గూడ్స్ షెడ్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విగ్రహాన్ని ఊరేగింపుగా రైల్వే కమాన్ ప్రాంతంలో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా రైల్వేగూడ్స్ షెడ్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు బొబ్బిలి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్, తదితరులు పాల్గొన్నారు.

**మోస్రా:** ఆషాడ మాసం సందర్భంగా గోవూర్ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ దేవతలకు డప్పు చప్పుళ్లతో ఆటపాటలతో బోనం సమర్పించి యాటలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించి కోరిన కోర్కేలు తీర్చాలని అమ్మవారిని కోరుకున్నారని గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

**బోధన్‌రూరల్:** బోధన్ పట్టణంలోని బస్వతారక్ నగర్‌లో పూసల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా మహలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. ఆషాద మాసం తొలి ఆదివారం కావడంతో బోనాల పండుగలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సకాలంలో కురువాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు పరమేష్, కోశాధికారి గోవింద్ కుమార్. నరేష్, తిరుపతి, అశోక్, చిన్న నాగేశం తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ


తలుపు పగుల గొట్టిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్ , జూలై7: ఆర్మూర్ పట్టణ శివారులో పెద్దమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలపులను పగులగొట్టి పెద్దమ్మతల్లి విగ్రహంపై గల సుమారు ఎనిమిది మసాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి పట్టగొలుసులు దొంగలు ఎత్తుకెళ్ళారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత కొన్నేళ్లుగా ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## నేడు జక్రాన్‌పల్లికి ఎమ్మెల్యే రాక

జక్రాన్‌పల్లి, జూలై7: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో సోమవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ కిరణ్మాయి తెలిపారు. జక్రాన్‌పల్లిలోనిఅరుంధతి పంక్షన్‌హాల్‌లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూప తిరెడ్డి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

### ఆదర్శ పాఠశాల సందర్శన

మండలంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాలను సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సందర్శించనున్నారని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## రెండో రోజు కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



నగరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దబజార్, జూలై 7: మాటతప్పితే పోరాటం తప్పదని న్యాయబద్ధంగా రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వర్ణ అన్నారు. ఆదివారం రెండవ రోజు ధర్నాచౌక్ వద్ద అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని అందుకే పోరాట బాట పట్టాల్సి వచ్చిందన్నారు.అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జూలై 1 నుంచి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క టీచర్లకు 2లక్షల రూపాయలు, హెల్పర్స్‌కు లక్ష రూపాయల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని వాగ్ధానం చేశారని ఇచ్చినమాట నిలబెట్టుకోకపోతే పోరాటం తప్పదని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా సర్క్యులర్ ఇచ్చి 65 సంవత్సరాలు నిండిన వారిని బలవంతంగా ఇంటికి పంపించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రమేష్‌బాబు, సరస్వతి, రాజ్యలక్ష్మి,హేమావతి, ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర


భీమ్‌గల్‌లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, జూలై 7: పూరిలో జరుగుతున్న జగన్నాధ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇస్కాన్ నిజామాబాద్ ద్వారకనగర్ వారి ఆధ్వర్యంలో జగన్నాధ రథయాత్ర కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం, ఇస్కాన్ నామమట్ట ప్రచార కేంద్రం భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. నూతనంగా తయారు చేయించిన పూరి రథంలో జగన్నాయకులను ఆశీలను చేసి బస్టాండ్ నుంచి అంగడిబజార్ మీదుగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకవచ్చారు.అనతంతరం హిందూమత సాంప్రదాయలను గురించి భక్తులకు వివరించారు.ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంగం సభ్యులు జవ్వాజి భూమయ్య, శ్రీనివాస్ జవ్వాజి, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో యువకుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన పి.నరేష్ మృత దేహం

రుద్రూరు, జూలై 7: రుద్రూరు పెద్ద చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామానికి చెందిన పి.నరేష్ అనే యువకుడు చెరువులో చేపల వేటకు వెళ్లగా వల చుట్టుకుని మృతి చెంది నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అప్పారావు ఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని వెలికి తీయిం చారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా జగన్నాథ వార్షికోత్సవం


ధర్పల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

ధర్పల్లి, జూలై 7: మండల కేంద్రంలో జగన్నాథ ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. గ్రామ శివారులోగల సిద్దుల గుట్టపై వెలసిన జగన్నాథుని వార్షికోత్సవం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహిస్తారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, లక్పతి, బొర్రన్న, రాము, నారాయణ, శ్రీనివాస్, సురేష్,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీమంజూనాథ ఆటో యూనియన్ కార్యవర్గ

కమ్మర్‌పల్లి, జూలై 7! కమ్మర్‌పల్లి లో శ్రీ మంజూనాథ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గత రెండు సంవత్సరాలు వరుసగా ఎన్నికైన బిట్ల అనీల్ ను మూడవసారి సైతం అధ్యక్షుడిగా సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా బొడ్డురాము, కోశాధికారిగా పెండెం మినేష్, కార్యదర్శిగా సుందరి రవిందర్, సలహాదారురుడిగా అబ్దుల్ ఖాదర్, దాత్రిక రాజేందర్, పిల్లమారి సుధాకర్ లను సభ్యులు ఎకగ్రీవంగ ఎన్నుకున్నారు.

## బాల్కొండలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బాల్కొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముప్కాల్, జూలై7: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997-98విద్యసంవత్సరం పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27ఏళ్ళ తర్వాత అందరు అప్యాయంగా పలకరించుకున్నారు.అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినోకరు యోగ క్షేమాలు అడిగితెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఒక్క చోట చేరిన స్నేహితులను కలుసుకోవడం ఆనందానికి అవదులు లేని క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేని మధుర స్మృతులని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువతో సన్మానించారు. అంతకు ముందు తొలి విద్యార్థుల మృతికి సంతాపం తెలిపారు.

# రహదారుల మరమ్మతులకు మోక్షం కలిగేనా?

నిజాంసాగర్, జూలై 7: గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా మారాయని, మరమ్మతులకు మోక్షం లభించేనా అని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారుల వెంట ప్రజలు వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. నిజాంసాగర్ మండలం మల్లూర్, జక్కాపూర్, వడ్డేపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులను 2021లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాగమడుకు శంకుస్థాపన చేస్తారని కార్యక్రమం అప్పట్లో ఖరారైంది. ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖాధికారులు ఈ రహదారులు బీటీ రోడ్డు


మల్లూర్ రహదారి

- జక్కాపూర్, మల్లూర్ రహదారులు అధ్వానం
- చలనం లేని అధికార యంత్రాంగం
- రోడ్లపై వెళ్లాలంటే నరకయాతన
- రహదారులకు మరమ్మతులు చేసేనా?
- ఇబ్బందుల్లో జక్కాపూర్, మల్లూర్, వడ్డేపల్లి గ్రామాల ప్రజలు

ఉన్నప్పటికీ మళ్లీ ఈ రహదారులపై బీటీ నివేసి రెన్యూవల్ చేశారు. మల్లూర్ రహదారిపై నాగమడుగు నిర్మాణానికి తీసుకోవాల్సిన ముడి సరుకు వాహనాలు భారీ బరువు కలిగి ఉండటంతో మల్లూర్ ఊర చెరువు నుంచి జక్కాపూర్ బస్‌స్టేషన్ వరకు అధ్వానంగా మారింది. ఈ రహదారి గుంతలమయం కావడంతో నాగమడుగు నిర్మాణ సంస్థ మట్టిని వేసి గుంతలు పూడ్చినా అడపా దడపా వర్షాలకు గుంతలమయమైంది. బీటీ రోడ్డుపై కేజ్ వీల్స్ తిరుగడంతో అధ్వానస్థితికి చేరుకుంది. బీటీ రోడ్డు మెటల్ రోడ్డును తలపిస్తోంది. వడ్డేపల్లి బస్‌స్టేషన్ వరకున్న రహదారి కూడా అధ్వాన స్థితికి చేరుకుంది. నిత్యం దుమ్ము చక్రాల ట్రాక్టర్లు అధికంగా తిరగడంతో రహదారి పూర్తిగా అధ్వానంగా మారాయి. పాలకులు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టే సంస్థ తూతూ మంత్రంగా మట్టిని వేసి గుంతలను పూడుస్తున్నా మళ్లీ అధ్వానంగా మారుతునే ఉన్నాయి. ఈ రహదారి వెంట గ్రామాల ప్రజలు వెళ్లాలంటే అనేక పాట్లు పడుతునే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రహదారులకు మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


జక్కాపూర్ ..


నాగిరెడ్డిపేట బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం

## బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం

నాగిరెడ్డిపేట, జూలై 7: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండ్‌ను నిజామాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనులలో భాగంగా రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమైనందున బస్టాండ్ స్థలం ఎంత వరకు పోతుందోనని పరిశీలించామని ఆమె చెప్పారు. రోడ్డు వెడల్పులో స్థలం పోగా మిగిలిన స్థలంలో షట్టర్ల నిర్మాణం ఎంత వరకు చేపట్టవచ్చని ఒక అంచనా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట బాన్సువాడ డీఎం సరితాదేవి ఉన్నారు.

### విశ్వహిందూ పరిషత్
## రామారెడ్డి గ్రామ నూతన కమిటీ ఎన్నిక

రామారెడ్డి, జూలై 7: విశ్వహిందూ పరిషత్ రామారెడ్డి గ్రామ నూతన కమిటీ ఆదివారం ఎన్నికను నియమించారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి ధరి, జిల్లా సత్సంగ్ ప్రముఖ్ బోల్గని శ్రీనివాస్ ఏకగ్రీవంగా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆకుల సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వడ్ల నారాయణ, కార్యదర్శి వడ్ల సంజీవ్, సహాయ కార్యదర్శి బచ్చుబోయిన మహేష్, కోశాధ్యక్షుడిగా రాజు, సత్సంగ్ ప్రముఖ్ బీపేట లక్ష్మీనారాయణ, ధర్మప్రసార ప్రముఖ్ తోకల శ్రీధర్, గోరక్ష ప్రముఖ్ బాలదేవ్ అంజయ్య నియమితులయ్యారు.


పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

## వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

కామారెడ్డి రూరల్, జూలై 7: మండలంలోని సరంపల్లి గ్రామ శివారులో గల భుకాన్‌పల్లి హనుమాన్ మందిరంలో ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయ అధ్యక్షుడు తడకమడ్ల ఆంజనేయులు పంతులు, ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణం తిలకించి, అన్నప్రసాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్, నాగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



వెల్గనూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

నిజాంసాగర్, జూలై 7: నిజాంసాగర్ మండలం వెల్గనూర్, నర్సింగ్‌రావు పల్లి, జక్కాపూర్ గ్రామాల్లో ఆలిండియా అంబేద్కర్ మండల శాఖ నాయకులు విగ్రహాలను ఆవిష్కరించారు. ఎన్నో రోజులుగా ముసుగుతో ఉన్న ముసుగు ఆవిష్కరణతో తొలగిపోయింది. రాజకీయ పార్టీలకు అతీతంగా వెల్గనూర్, నర్సింగ్‌రావు పల్లి, జక్కాపూర్ గ్రామాల అంబేద్కర్ గ్రామ కమిటీలు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పారు. ఆర్థిక సహాయం విగ్రహ దాత మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఒక్కొక్క గ్రామానికి రూ.31వేలను అందజేశారు. గతంలో ఆవిష్కరణ ఆర్భాటంగా చేద్దామన్న అంబేద్కర్ గ్రామ కమిటీల సభ్యులు చేపట్టలేక పోయారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఉండటంతో అంబేద్కర్ విగ్రహాలు ముసుగులో ఉండిపోయాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల ప్రముఖులు, మండల ఆలిండియా అంబేద్కర్ సంఘ అధ్యక్షులు బేగరి రాజు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గైని విఠల్, జక్కాపూర్, వెల్గనూర్, నర్సింగ్‌రావు గ్రామాల అధ్యక్షులు బోడ సాయిలు, నర్సింలు, సాయిలు, దళిత ప్రతినిధులు రమేష్, గంగారాం, జుక్కల్ నియోజకవర్గ అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోచయ్య, గ్రామాల మాజీ సర్పంచులు, దళిత సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

# జికా వైరస్ వ్యాధి పట్ల అప్రమత్తం చేసిన కేంద్రం


మద్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి

- తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో భయం భయం
- రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేనా?

మద్నూర్, జూలై 7: మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రజలు జికా వైరస్ వ్యాధిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జీకా వైరస్ విజృంభిస్తోంది. దీంతో మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న తెలంగాణ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మహారాష్ట్రలోని పుణెలో ఒక్క రోజే ఆరు జీకా వైరస్ వ్యాధి కేసులు నమోదు కావడంతో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఇటీవల అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతీ ఆసుపత్రిలో ఖచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమలు పెరుగుదుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న జుక్కల్ నియోజకవర్గం నుంచి రోజుకు వేలాది మంది మహారాష్ట్రకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. మన వద్ద ఇంత వరకు జికా వైరల్ వ్యాధిపై కార్యాచరణ ఏమి కానరావడం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒక వైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు విజృంభజన మొదలైంది. క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న అధికారులు లేకపోవడంతో సమస్యగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### దోమల ద్వారా వ్యాప్తి

జికా వైరస్ వ్యాధి అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఎడిస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తోంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికెన్ గున్యా ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి రెండు నుంచి ఏడు రోజుల పాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్ల కలక, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి.

### నివారణ మార్గాలు

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.



## మహంకాళి అమ్మవారికి బోనాలు

భిక్కనూరు, జూలై 7: మండలకేంద్రంలో కొలువుదీరిన మహంకాళి అమ్మవారికి ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ ఇంటికో బోనం తీసి పోతరాజుల విన్యాసాల నడుమ ప్రధానవీధుల గుండా బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు మున్నూరు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాఢంలో సంఘం ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 'పిల్లలకు సువర్ణ ప్రాసన అమృతం లాంటిది'


బస్వాపూర్‌లో పిల్లలకు సువర్ణ ప్రాసన వేస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూలై 7: సువర్ణ ప్రాసన చిన్నపిల్లలకు అమృతం లాంటిదని పాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పుష్యమీ నక్షత్రాన్ని పురస్కరించుకుని గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పిల్లలకు సువర్ణ ప్రాసన చుక్కలను వేయించారు. ఈ సందర్భంగా గోవనం ట్రస్ట్ జిల్లా పాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతినెల పుష్యమీ నక్షత్రం రోజున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ దివ్య ఔషదాన్ని 15ఏళ్ల లోపు వారికి వేయడం జరుగుతుందని, ఈ మందు తాగితే ఒక్కసారి చదవగానే ప్రతిది గుర్తుండి పోతుందని, భవిష్యత్తులో వారసత్వ వ్యాధులు దరిచేరవని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

బీబీపేట, జూలై7: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ శివారులో ద్వి చక్ర వాహనం పై నుంచి పడి వాహనదారుడికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్దూరి బాల య్య తన సొంత పనుల నిమిత్తం తుజాల్‌పూర్ వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు, చేతులకు గాయాలయ్యాయి, స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతృప్తినిచ్చాయి

- మాజీ ఎంపీ బీబీ పాటిల్

కామారెడ్డి రూరల్, జూలై 7: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశాలలో భాగంగా కామారెడ్డి జిల్లా కార్యాలయంలో కామారెడ్డి అసెంబ్లీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. మోదీకి ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి శాసన సభ్యుడు కాటిపల్లి వెంకట రమణారెడ్డి కృషితో కామారెడ్డిలో బీజేపీకి అత్యధికంగా ఓట్లు వచ్చాయని కానీ మిగితా చోట్ల ప్రజల్ని ఆకట్టుకోలేక పోయామని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్ని కల్లో అన్ని స్థానాలు గెలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతృప్తిని ఇచ్చాయని, జహీరాబాద్ పార్లమెంట్ కూడా గెలుపు అంచుల్లో ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ కాసర్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు సంధ్య, వేణు పాల్గొన్నారు.

## రేపు టీయూలో జాబ్ మేళా

డిచ్‌పల్లి, జూలై7: తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న తెలంగాణ విశ్వవిద్యాలయం, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సంయుక్తంగా డీఎస్ టెక్నాల జీస్ కంపనీలో టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్స్ క్యూటీవ్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి డీఎస్ టెక్నాలజీస్ వారిచే ఉద్యోగమేళా నిర్వహిస్తున్నమని ఈ మేళాలలో ఉద్యోగ ఔత్సహికులకు, వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కర్షన్, ఎఫ్‌టూఎఫ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తునామని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.పాత నాగరాజు తెలిపారు. పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ప్లేస్‌మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, జూలై 7: శ్రీరాంసాగర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రెండు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీపీఎం మారుతి తెలిపారు. కాంట్రాక్ట్ సీఈవో మేనేజర్‌కు బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ బీబీఏ సమానమైన ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు, అలాగే ఇంటర్ డిప్లొమా అగ్రికల్చర్, అగ్రికల్చర్ బిజినెస్, మార్కెటింగ్ కోర్సులు పూర్తి చేసి ఉండాలని, నెలసరి వేతనం రూ.15వేలు ఉంటుందన్నారు.అకౌంటెంట్ ఉద్యోగానికి బీకాం కంప్యూటర్, అకౌంటెంట్ అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు బాల్కొండ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

దోమకొండ, జూలై 7: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం ఇటీవల పదవీకాలం పూర్తిచేసుకున్న ప్రజాప్రతినిధులను ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాజకీయంగా ఇటీవల వివిధ పదవులలో వీడ్కోలు పొందిన మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, ఎంపీటీసీలు నిమ్మ శంకర్, కడారి రమేష్, కోట సదానందలను సన్మానించి వారు చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పున్న రాములు, అబ్రబోయిన సిద్దరాములు, కొండ శ్రీనివాస్, మలబోయిన రాజు, అబ్రబోయిన రాజేందర్, నాగరపు సత్యం, కామిండ్ల క్రిష్ణ, బోయిని రవి, తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి కలాన్ బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి


కలాన్ బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తయిన దృశ్యం

నాగిరెడ్డిపేట, జూలై 7: మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామం వద్ద 50 లక్షల 90 వేల రూపాయల వ్యయంతో పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఏడాది క్రితం ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కాగా, బ్రిడ్జి నిర్మాణం పనులు దిమ్మెల వరకు జరిగిన అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సుమారు ఎనిమిది నెలలుగా బ్రిడ్జి నిర్మాణం పనులను నిలిచిపోవడంతో జూన్ నెల 10న నిలిచిపోయిన లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణం పనులు శీర్షికతో ఆంధ్రజ్యోతి వార్త కథనాన్ని ప్రచురించగా ఈ వార్తకు నీటి పారుదల శాఖున్నతాధికారులు వెంటనే స్పందించారు. బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ తిరిగి పనులను పునః ప్రారంభించారు. దిమ్మెల వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగగా, స్లాబ్‌పనులు మిగిలి ఉండటంతో బ్రిడ్జి స్లాబ్ పనులను వెంటనే చేపట్టి వేగవంతంగా పనులు జరిపి బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి చేశారు. బ్రిడ్జి నిర్మాణం పనులు అర్ధాంతరంగా గత ఎనిమిది నెలలుగా నిలిచిపోగా తిరిగి నిర్మాణం పనులు ప్రారంభమై స్లాబ్ పనులు పూర్తి కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## అధ్వానంగా రోడ్లు.. పట్టించుకోని అధికారులు


ధర్మారావ్‌పేట్ రోడ్డుపై గుంతలు ఏర్పడి నీరు నిలిచిన దృశ్యం

సదాశివనగర్, జూలై 7: మండలంలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా తయారైనప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి ధర్మారావ్‌పేట్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై జాతీయరహదారి పక్కన గుంతలు ఏర్పడి చిన్న వర్షం కురిసిన నీరు చేరి ప్రమాదకరంగా తయారైంది. మండలంలోని పంచాయతీరాజ్ రోడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లన్ని అధ్వానంగా తయారవుతున్నాయి. గుంతలు ఏర్పడి తరుచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో మండలంలోని ధర్మారావ్‌పేట్, అమర్లబండ గ్రామాలతో పాటుగా పలుగ్రామాల్లోని రోడ్లను అధికారులు పట్టించుకుని గుంతలను పూడ్చి మరమ్మతు చేయించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## అగ్నివీర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 7: భారత వాయుసేనా అగ్నివీర్ వాయులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 3, 2004 నుంచి 3 జనవరి 2008 మధ్య పుట్టిన వారై ఉండి ఇంటర్మీడియెట్, ఇంటర్మీడియెట్‌కు సమానమైన విద్యార్హత కలిగి వివాహం కాని యువతీ యువకులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. అర్హులైన వారు ఈనెల 8 నుంచి 28 వర కు అగ్నిపత్‌వాయు.సిడిఎసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

## కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూలై 7: ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి టిజిఎప్‌సెట్-2024 మొదటి విడత కౌన్సిలింగ్ కొనసాగుతుంది. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల కౌన్సిలింగ్ కేంద్రంలో ఆదివారం 630 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు జిల్లా సమన్వయ కర్త శ్రీరాంకుమార్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 13 వరకు కొనసాగుతుందని వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 8 నుంచి 15తేదీలోగా వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డ్యాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశం

నిజామాబాద్ అర్బన్, జూలై 7: నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని నగరంలోని అంజలి సిస్టర్స్ డాన్స్ అకాడమి నందు నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఆనంద్‌బాబు మాట్లాడుతూ అసోసియేషన్ ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 20వ తేదీన జిల్లాస్థాయి కల్చరల్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| శాంతి | ఓసీ |
| దర్శన్ | కల్కి |
| ప్రియా 70 | కల్కి |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | కల్కి |
| వెంకటేశ్వర | మహారాజ |

## చికెన్ ధరలు



| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | 160 | 200 | 220 |
| వెన్‌కాబ్(కిలో) | 170 | 220 | 230 |

